క్లుప్తంగా...

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ సబ్‌స్టేషన్ 11 కేవీ ఎన్‌ఎండీసీ కాలనీ ఫీడర్ పరిధిలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మరమ్మతులు జరుగుతాయని ఏఈ రమేష్ తెలిపారు. ఈస్ట్ ఆనంద్‌బాగ్, తరుణి ఎన్‌క్లేవ్, ఇక్రిసాట్ కాలనీ, సీఫెల్ కాలనీ, కళ్యాణ్‌నగర్, బ్యాంక్ కాలనీ, రామచంద్ర ఎన్‌క్లేవ్, తాళ్లబస్తీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

బఫర్ జోన్‌లో నిర్మాణాలను ఆపాలి

బోడుప్పల్: 20వ డివిజన్ పరిధిలోని సుద్దకుంట బఫర్ జోన్‌లో కొనసాగుతున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం న్యూసాయి మారుతీనగర్ అధ్యక్షులు పి.నర్సింగ్‌రావు, ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డి, కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. బఫర్ జోన్‌లో 400 గజాల స్థలంలో ప్రహరీ గోడను నిర్మిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

అల్వాల్: గొట్టిముక్కల అఖిల్‌గౌడ్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మాజీ కో–ఆప్షన్ సభ్యులు, ఉద్యమకారులు గొట్టిముక్కల జ్యోతిగౌడ్ ఆధ్వర్యంలో అఖిల్‌గౌడ్ 6వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ముందుగా అఖిల్‌గౌడ్ చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పరమేష్, నాగేశ్వర రావు, శ్రీనివాస్‌గౌడ్, సాయిరాంగౌడ్, లక్ష్మణ్ ముదిరాజ్, బసవరాజ్, అరవింద్, అశ్విన్, సులోచన తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల పిల్లలకు విద్యావకాశాలను మెరుగుపర్చాలి

– గవర్నర్‌కు గోపు రమణారెడ్డి వినతి



గవర్నర్‌కు వినతి పత్రం అందజేస్తున్న గోపు రమణారెడ్డి

అల్వాల్: మాజీ సైనిక ఉద్యోగుల పిల్లల విద్యావకాశాలను మెరుగు పర్చుకునేందుకు చొరవ తీసుకోవాలని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్‌ను మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోపు రమణారెడ్డి కోరారు. మంగళవారం గవర్నర్‌ను కలిసి గోపు రమణారెడ్డి వినతి పత్రం అందజేశారు. జేఎన్‌టీయూ అనుబంధ కళాశాలలో విద్యాభ్యాసం చేసే మాజీ సైనిక ఉద్యోగుల పిల్లలకు గతంలో 15 నుంచి 30 శాతం గ్రేస్ మార్కులు కలిపేందుకు అవకాశం కల్పించారని, ప్రస్తుతం ఆ నిబంధనలు పాటించకపోవడంతో పలువురు విద్యార్థులు విద్యావకాశాలకు దూరం అవుతున్నారన్నారు. చొరవ తీసుకొని విశ్వవిద్యాలయాలకు సూచనలు ఇవ్వాలని కోరారు.

కాంగ్రెస్‌లో దళితులకు సముచిత స్థానం



ఉప్పల్: ఉప్పల్ కాంగ్రెస్‌లో దళితులకు సముచిత స్థానం లభించిందని ఉప్పల్, హబ్సిగూడ డివిజన్ అధ్యక్షుడు బాకారం లక్ష్మణ్, గన్నారం విజయ్ కుమార్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉప్పల్ ఏ బ్లాక్ పరిధిలో ఐదు డివిజన్లలో రెండు అధ్యక్ష పదవులు దళితులకు ఇవ్వడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. తమకు ఈ అవకాశం కల్పించిన జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్, ఏ బ్లాక్ అధ్యక్షుడు పరమేశ్వర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. లింగంపల్లి రామకృష్ణ, నాగారం వెంకటేష్, బాకారం అరుణ్, రఘు పాల్గొన్నారు.

డ్రైనేజీని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి

మల్లాపూర్: భూగర్భ డ్రైనేజీల్లో పేరుకుపోయిన మట్టి, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అధికారులు, సిబ్బందికి సూచించారు. మంగళవారం న్యూభవానీనగర్ కాలనీలో మట్టి తొలగింపు పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మల్లాపూర్ ఓల్డ్ విలేజ్‌లో సీసీ రోడ్డు పనులను పర్యవేక్షించారు. జలమండలి డీజీఎం సతీష్, మేనేజర్ సందీప్, ఏఈ స్రవంతి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ భిక్షపతి పాల్గొన్నారు.

పోషకాహారం.. ఆరోగ్యానికి సోపానం



ఈ నెలాఖరు వరకు పోషణ మాసోత్సవం

- మహిళలు, చిన్నారుల ఆరోగ్యమే లక్ష్యం
- పోషకాహారం తీసుకొనేలా ప్రోత్సాహం
- శివారు జిల్లాల సంక్షేమ శాఖల కార్యాచరణ
- ఈ నెలాఖరు వరకు అవగాహన సదస్సులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మహిళలు, చిన్నారుల్లో పోషకాహార స్థితిని మెరుగుపర్చాలనే లక్ష్యంతో పోషణ మాసోత్సవాన్ని చేపట్టారు. తద్వారా ఆరోగ్యకరంగా జీవించేందుకు బాటలు వేసేందుకు జిల్లా సంక్షేమ శాఖ చర్యలు తీసుకుంటోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయంలో పలు పథకాలను కూడా అమలు చేస్తున్నాయి. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. నగరంతో సహా శివారు జిల్లాలైన మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డిలలో పోషకాల లోపంతో సతమవుతున్న చిన్నారులు ఇప్పటికీ చాలా మంది ఉన్నారు. పోషకాలపై అవగాహన కల్పించి, పథకాలను సద్వినియోగం చేసుకోవడానికి అవకాశం కల్పించే మాసోత్సవాన్ని పోషణ్ అభియాన్ పేరుతో ఈ నెలాఖరు వరకు ఆయా జిల్లా సంక్షేమ శాఖలు నిర్వహిస్తున్నాయి.

ఇదీ లక్ష్యం..

స్వచ్ఛంద సంస్థలు, పాఠశాలలు, ప్రజల భాగస్వామ్యంతో సంపూర్ణ ఆరోగ్యవంతమైన సమాజమే లక్ష్యంగా ఈ నెలాఖరు వరకు వివిధ కార్యక్రమాలతో తల్లిదండ్రులను చైతన్యం చేస్తారు. పోషకాహార లోపం లేని తెలంగాణగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాలకు రూపకల్పన చేశారు.

- గర్భిణులు మిటమిన్లు, ఐరన్ సమృద్ధిగా ఉన్న వివిధ రకాల పోషకాహారం ఎలా తీసుకోవాలో అవగాహన కల్పిస్తారు.

బహుమతుల ప్రదానం

పోషణ మాసోత్సవంలో భాగంగా నగరంతో సహా శివారు జిల్లాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలు, పురపాలక సంఘాలు, గ్రామపంచాయతీల్లో పిల్లల ఎత్తు, బరువు చూస్తారు. ఆరోగ్యంగా ఉన్న పిల్లలకు బహుమతులు అందజేస్తారు. రక్తహీనత శిబిరాలు నిర్వహించి, పోషకాహారంపై అవగాహన కల్పిస్తారు. ఈ సంవత్సరాన్ని చిరుధాన్యాల సంవత్సరంగా గుర్తించటం వల్ల.. మాసోత్సవాల్లో ఈ అంశానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. చిన్నారులకు నిత్యం పోషక విలువలతో కూడిన ఆహారం అందించేందుకు పాలు, పండ్లు సూచిస్తున్నారు. యువజన, మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తారు.

బరువు లేని చిన్నారులపై ప్రత్యేక దృష్టి

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా పోషణ మాసోత్సవాన్ని షెడ్యూలు ప్రకారం నిర్వహిస్తున్నాం. చిన్నారులు ఆరోగ్యంగా ఎదగాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకుసాగుతోంది. మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న మాసోత్సవం సజావుగా సాగేలా చూస్తున్నాం. వయస్సుకు తగ్గ బరువులేని చిన్నారులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందేలా చూస్తున్నాం. నిత్యం పాలు, పండ్లు, కూరగాయలు, చిరుధాన్యాలను ఆహారంలో చేర్చడం ద్వారా ఉండే ప్రయోజనాలపై వారికి వివరిస్తున్నాం.

– కృష్ణారెడ్డి, జిల్లా సంక్షేమాధికారి, మేడ్చల్–మల్కాజిగిరి.

రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు

కుషాయిగూడ: సేవాభావంతోనే నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు బీఆర్‌ఎస్ ఉప్పల్ అభ్యర్థి, బీఎల్‌ఆర్ ట్రస్టు చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్, తిరుమలనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేటుగా ఏర్పాటు చేసిన ఉపాధ్యాయురాలు, ఆయాలకు మంగళవారం ఆయన తన ట్రస్టు తరఫున జీతాలు చెల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి తనవంతు సాయం అందించడంతో పాటు పేద విద్యార్థులకు ఉన్నత చదువులు, విదేశాల్లో చదువులు, ఉద్యోగాలు కల్పిస్తూ సేవా కార్యక్రమాలను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో సేవా కార్యక్రమాలను విస్తృతం చేసి పేదలకు అండగా నిలుస్తానన్నారు.



బీఎల్‌ఆర్ ట్రస్టు తరఫున జీతాలు చెల్లించిన బండారి లక్ష్మారెడ్డి

కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఎం శ్రీనివాస్, గుమ్మడి జంపాల్‌రెడ్డి, దూసరి నవీన్, పూస రమేష్, నవీన్, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

కాప్రా: సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీలో విద్యార్థులపై ర్యాగింగ్‌కు పాల్పడుతున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ కాప్రా సర్కిల్ నేతలు డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్‌ఎఫ్‌ఐ ముఖ్యకార్యకర్తల సమావేశం సందర్భంగా ఈసీఐఎల్‌లో వారు మీడియాతో మాట్లాడారు. ర్యాగింగ్ పట్ల మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఆయన నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. గతంలో ర్యాగింగ్ వల్ల వరంగల్ మెడికో విద్యార్థి మృతి చెందిన ఘటనను వారు గుర్తు చేశారు. ఇలాంటి ఘటనలపై పోలీసులు సీరియస్‌గా ఉండాలని, అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు శ్యామ్, అరుణ్, నిఖిల్, అనిల్, రవి, రాకేష్, బాలాజీ, కిరణ్, శివ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకుందాం

గౌతంనగర్/మల్కాజిగిరి: గణేష్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకుందామని మల్కాజిగిరి డివిజన్ ఏసీపీ పి.నరేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం సియారా గ్రాండ్ కన్వెన్షన్ హాల్‌లో పీస్ కమిటీ సమావేశం ఇన్‌స్పెక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ఏసీసీ నరేష్‌రెడ్డి మాట్లాడుతూ మండప నిర్వాహకులు, ప్రజల సహకారంతోనే నిమజ్జనం ప్రశాంతంగా జరుగుతుందన్నారు. మండప నిర్వాహకులు మండపాల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తప్పని సరిగా ఉదయం నుంచి రాత్రి వరకు మండపం వద్ద నిఘా ఉండాలన్నారు. మండపానికి తీసుకునే విద్యుత్ కనెక్షన్ విషయంలో జాగ్రత్తలు తీసుకొని ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలన్నారు. సాధ్యమైనంత వరకు వైయిర్ లెస్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. భాగ్యనగర్ ఉత్సవ సమితి వారికి సహకరించి వినాయకులను ఏర్పాటు చేస్తున్న మండప నిర్వాహకుల సమాచారం పోలీసులకు అందించాలన్నారు. దరఖాస్తుతో పాటు ఏ రోజు నిమజ్జనం చేస్తారో ముందస్తుగా తెలియజేయాలన్నారు. ఎస్‌ఐలు సతీష్, కృష్ణ, మల్లయ్య, భాగ్యనగర్ ఉత్సవ సమితి సభ్యులు, మండప నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జరుపుకోవాలి

ఉప్పల్: ఉప్పల్ గణేష్ ఉత్సవ సమితి నూతన కమిటీ మంగళవారం ఉప్పల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డిని కలిసి శాలువాతో సత్కరించారు. వినాయక ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకునే విధంగా నిర్వాహకులు పనిచేయాలని లక్ష్మారెడ్డి సూచించారు. ఉత్సవ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకుల మహేందర్, అన్న బాలకృష్ణ, నిరంజన్‌చారి, కొండ్రు హనుమంతు, రాంరెడ్డి, వీరేష్, జెట్ట కిషోర్, మనోహర్‌రెడ్డి, నవీన్‌గౌడ్ ఉన్నారు.

నిమజ్జన ఘాట్ పరిశుభ్రంగా ఉండాలి

మల్కాజిగిరి: సఫిల్‌గూడ నిమజ్జన ఘాట్ వద్ద ఏర్పాట్లను స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ అధికారులతో కలిసి పరిశీలించారు. చెరువుకు సమీపంలో ఉన్న టాయిలెట్స్ కోసం నూతనంగా వేసిన పైపులైన్లను పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ అదే ప్రాంతంలో(బలరాంనగర్) నుంచి మురుగు నిమజ్జన ఘాట్ వద్ద చేరకుండా చూడాలని అధికారులకు సూచించామన్నారు. పలు ప్రాంతాల్లో విగ్రహాలను తీసుకెళ్లడానికి ఇబ్బంది లేకుండా చెట్ల కొమ్మలను తొలగించే పనులు ప్రారంభమైనట్లు చెప్పారు. ఏఈ దీపక్, వీఐ రమేష్, మేనేజర్ నవీన్, నాగార్జున, మహేష్, అభిషేక్ పాల్గొన్నారు.

చిన్నతరహా సూక్ష్మ పరిశ్రమలకు ప్రభుత్వ ప్రోత్సాహం

కుషాయిగూడ: చిన్నతరహా, సూక్ష్మ పరిశ్రమల మనుగడపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కమిషనరేట్ ఆఫ్ ఇండస్ట్రియల్ అడిషనల్ డైరెక్టర్ రాజ్‌కుమార్ ఓత్కర్ అన్నారు. వివిధ కారణాలతో దివాలా తీసిన చిన్నతరహా సూక్ష్మ పరిశ్రమలకు జీవం పోసేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఇబ్బందుల్లో ఉన్న చిన్నతరహా, సూక్ష్మ పరిశ్రమలకు ఊతమిచ్చేందుకు తెలంగాణ ఇండస్ట్రియల్ హెల్త్ క్లినిక్ లిమిటెడ్(టీఐహెచ్‌సీఎల్) సంస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఈ సంస్థ సెంటర్ ఫర్ ఎకానమి అండ్ సోషల్ స్టడీస్ (సీఈఎస్‌ఎస్) సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా సర్వే చేస్తూ మూలనపడ్డ చిన్నతరహా, సూక్ష్మ పరిశ్రమలను గుర్తించి వారికి కావాల్సిన ప్రోత్సాహకాలను అందిస్తోందన్నారు. చర్లపల్లి పారిశ్రామికవాడలో సర్వే నిర్వహించి 319 చిన్నతరహా, సూక్ష్మ పరిశ్రమల స్థితిగతులపై నివేదిక సిద్ధం చేశామన్నారు. మంగళవారం చర్లపల్లి ఇండస్ట్రీయల్ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అవగాహన సదస్సులో నివేదిక వివరాలను వెల్లడించారు. సీఐఏ అధ్యక్షుడు కె.గోవిందరెడ్డి, ఐలా చైర్మన్ రోషిరెడ్డి, సీఐఏ సెక్రటరీ కె.చంద్రశేఖర్‌రెడ్డి, టీఐహెచ్‌సీఎల్ ఫౌండర్ డాక్టర్ ఎర్రంరాజు, వెంకటేశ్వర్లు, ప్రసాద్ పాల్గొన్నారు.

నైపుణ్యంతో కూడిన విద్యతో రాణించవచ్చు



అల్వాల్: నైపుణ్యంతో కూడిన విద్యతో విద్యార్థులు వివిధ రంగాల్లో రాణించవచ్చని తెలుగు గజల్ వాగ్గేయకారుడు గజల్ శ్రీనివాస్, రఘు అన్నారు. అల్వాల్ లయోలా అకాడమిలో స్కిల్ ఫోర్జ్‌పై రెండు రోజుల జాతీయ వర్క్‌షాప్ ప్రారంభమైంది. స్కిల్ ఫోర్జ్‌పై జాతీయ వర్క్‌షాపును మంగళవారం డాక్టర్ గజల్ శ్రీనివాస్ ప్రారంభించారు. లయోలా అకాడమి ప్రిన్సిపల్ ఫాదర్ డాక్టర్ జోజిరెడ్డి, అసిస్టెంట్ ప్రొ.అంజనీకుమారి, ఐక్యుసి ఇన్‌చార్జి డాక్టర్ రమ, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉదయపూర్ డిక్లరేషన్ తెలంగాణలో అమలుచేయాలి

అల్వాల్: కాంగ్రెస్ పార్టీ చేసిన ఉదయపూర్ డిక్లరేషన్ తెలంగాణలో అమలు చేయాలి కోరుతూ ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి మాణిక్‌రావు గోవింద్ థాక్రేను బీసీ సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్ కోరారు. మంగళవారం థాక్రేను ఆయన కలిశారు. విక్రమ్‌గౌడ్ మాట్లాడుతూ ఉదయపూర్ డిక్లరేషన్‌లో ప్రతి పార్లమెంట్ సెగ్మెంట్‌లో మూడు ఓబీసీ టికెట్లు ఇవ్వాలని జాతీయ కాంగ్రెస్ కమిటీ నిర్ణయించిందని, కర్ణాటలో కూడా ఇంప్లిమెంట్ చేయడం జరిగిందని, తెలంగాణలో రాబోయే ఎలక్షన్‌లో కూడా 60 ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని వివరించారు.



మాణిక్‌రావు థాక్రే మాట్లాడుతూ జాతీయ నాయకత్వం దీనిపై దృష్టి పెట్టిందని, అన్ని పార్టీల కన్నా కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఎక్కువ సీట్లు ఇస్తుందని హామీ ఇచ్చినట్లు విక్రమ్‌గౌడ్ తెలిపారు.

శారదాంబకు లక్ష గాజుల అలంకరణ

అల్వాల్: శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా సైనిక్‌పురి శృంగేరి శంకరమఠంలో మంగళవారం శ్రీశారదాంబకు లక్ష గాజుల అలంకరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రావణ మంగళవారం నోములు నోచుకుని వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. కుంకుమార్చనలు చేశారు. మాంగళ్య దేవి హోమం చేసినట్లు శృంగేరీ శంకర్ మఠ్ ధర్మాధికారి పండరినాథ్ తెలిపారు.

డబుల్ ఇళ్లలో అవినీతి

కాప్రా: ప్రభుత్వం కేటాయించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపులో కొందరు అధికార పార్టీ నేతలు అవినీతి పాల్పడుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్.బాలమల్లేష్ ఆరోపించారు. మంగళవారం ఈసీఐఎల్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీ నేతలకు డబ్బులు చెల్లించుకున్న వారికే ఇళ్ల కేటాయింపు జరుగుతోందని విమర్శించారు. సీపీఐ నాయకులు దామోదర్‌రెడ్డి, ఉమామహేష్, దశరథ, శంకర్‌రావు, స్వామి, ధర్మేంద్ర, సత్యప్రసాద్ పాల్గొన్నారు.

సాంబార్‌లో బొద్దింక

కాప్రా: గాంధీనగర్‌కు చెందిన ఓ వ్యక్తి రాధిక చౌరస్తా సమీపంలో కర్రీ పాయింట్‌లో సాంబర్ కొనుగోలు చేసి భోజనం చేశాడు. అనంతరం అస్వస్థతకు గురయ్యాడు. దీంతో అనుమానం వచ్చి సాంబార్‌ను పరిశీలించాడు. సాంబర్‌లో బొద్దింక కనిపించడంతో షాక్‌కు గురయ్యాడు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని కాప్రా సర్కిల్ ఏఎంహెచ్‌ఓ డాక్టర్ స్వప్నారెడ్డి తెలిపారు. బుధవారం ఈ ఘటనపై విచారణ జరుపుతామని తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఉప్పల్: ఉప్పల్ వరంగల్ బస్టాప్‌లో సుమారుగా 45 నుంచి 50 సంవత్సరాల వయస్సుగల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గమనించి ఉప్పల్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని గాంధీ మార్చురీకి తరలించారు. బిచ్చగాడు కావొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

మహిళల ఆరోగ్య సంరక్షణకు కృషి



నాచారంలో మహిళా ఆరోగ్య కార్యక్రమంలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

మల్లాపూర్: మహిళల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం నాచారం అన్నపూర్ణకాలనీ, రైతుబజార్ సమీపంలో బస్తీదవాఖానాలో ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని స్థానిక కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు సరైన ఆరోగ్య సంరక్షణ సేవలు అందించేందుకు సమగ్ర మహిళ ఆరోగ్య పథకం రూపొందించారని, దీని ద్వారా స్క్రీనింగ్ వైద్య పరీక్షలు వ్యాధి నిర్ధారణ చికిత్స మందులను అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నారాయణ రావు, వైద్యులు సౌందర్య లత, నేహ, మెడికల్ సూపర్‌వైజర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆదాయం పెంపులో ఉద్యోగుల పాత్ర కీలకం

బోడుప్పల్: ఆర్టీసీ ఆదాయాన్ని పెంచడంలో ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని ఆర్టీసీ సికింద్రాబాద్ డివిజనల్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ కృపాకర్‌రెడ్డి అన్నారు. చెంగిచర్ల డిపోలో ఆయిల్ పొదుపుతో పాటు అధిక లాభాలు వచ్చేందుకు కృషి చేసిన ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు మంగళవారం అందజేసిన ఆర్టీసీ ప్రగతి చక్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెంగిచర్ల డిపోలో ఆయిల్ పొదుపు, లాభాలు వచ్చేందుకు కృషి చేసిన డ్రైవర్లు, కండక్టర్లకు అవార్డులతో పాటు నగదు ప్రోత్సాహకాలను అందజేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు శ్యాంసన్ జోసెఫ్, కృష్ణంరాజు, చెంగిచర్ల డిపో మేనేజర్ కవిత, అసిస్టెంట్ మేనేజర్లు ఆనందరావు, సుబ్రహ్మణ్యం, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.



అవార్డు, నగదు ప్రోత్సాహకం అందుకుంటున్న ఆర్టీసీ కండక్టర్

అనుమతి లేకుండా రోడ్డు తవ్విన వారికి జరిమానా

బోడుప్పల్: నగర పాలక సంస్థ నుంచి ఎలాంటి అనుమతి లేకుండా రోడ్డు తవ్విన ఓ వ్యక్తికి రూ.5 వేల జరిమానా విధించినట్లు బోడుప్పల్ కమిషనర్ జి.వేణుగోపాల్‌రెడ్డి వెల్లడించారు. బోడుప్పల్ నగర పాలక సంస్థ కార్యాలయంలో ఆయన మంగళవారం మాట్లాడుతూ 18వ డివిజన్ సరస్వతినగర్‌లో ఓ వ్యక్తి మున్సిపల్ కార్యాలయం నుంచి ఎలాంటి అనుమతి లేకుండా రోడ్డు కటింగ్ చేశాడు. విషయం తెలుసుకున్న అధికారులు ఆయనకు రూ.5 వేల జరిమానాతో పాటు కటింగ్ ఫీజును వసూలు చేసినట్లు వెల్లడించారు. అనుమతి లేకుండా, భద్రతా ప్రమాణాలు పాటించకుండా రోడ్డు తవ్వకాలు చేపడితే మున్సిపల్ యాక్ట్‌ను అనుసరించి భారీ జరిమానాతో పాటు క్రిమినల్ చర్యలు చేపడతామన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం

రామంతాపూర్: డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్‌లో మంగళవారం నిర్వహించిన గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ అధ్యక్షుడు మందముల పరమేశ్వర్‌రెడ్డి పాల్గొని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో పేదల సంక్షేమం కోరే పార్టీ కాంగ్రెస్ ఒక్కటేనని, వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. రాష్ట్రంలో బీజేపీ, టీఆర్‌ఎస్ లోపాయకారి ఒప్పందాలతో వచ్చే ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధం అవుతున్నాయన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేతలు మురళిగౌడ్, ఉపేందర్‌రెడ్డి, అరుణ్, శ్రీకాంత్, సందీప్, సతీష్‌గౌడ్ పాల్గొన్నారు.

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు

కుషాయిగూడ: కుషాయిగూడలో దశలవారీగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపడతామని వాటర్ వర్క్స్ డీజీఎం సతీష్‌కుమార్ అన్నారు. కుషాయిగూడలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం ఆయనను కలిశారు. ఇప్పటికే ప్రతిపాదనలు చేశామని, సాధ్యమైనంత త్వరగా పనులు ప్రారంభమయ్యేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పనగట్ల చక్రపాణిగౌడ్, చిత్తుల కిషోర్, బాలనర్సింహ, బ్రహ్మచారి, నర్సింగ్‌రావు, గణేష్, చల్లా సూరి, రాజు, నాగరాజు, వినోద్‌చారి, మణికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీని శుభ్రం చేయాలి

మల్లాపూర్: భూగర్భ డ్రైనేజీల్లో పేరుకుపోయిన మట్టి, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అధికారులు, సిబ్బందికి సూచించారు. మంగళవారం న్యూభవానీనగర్ కాలనీలో మట్టి తొలగింపు పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మల్లాపూర్ ఓల్డ్ విలేజ్‌లో సీసీ రోడ్డు పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం సతీష్, మేనేజర్ సందీప్, ఏఈ స్రవంతి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ భిక్షపతి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి

అల్వాల్: డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని స్థానిక కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని శ్రీనివాసనగర్‌లో అల్వాల్ డీసీ శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ ఏసీపీ సయ్యద్‌తో కలిసి ఆమె పర్యటించారు. ఆమె మాట్లాడుతూ ప్రైవేటు ఆస్తిగా పేర్కొంటున్న పార్కు స్థలంపై కేసుకు సంబంధించిన అంశాలను ఫాలోఆప్ చేయాలని, రోడ్లు, పారిశుద్ధ్యం గురించి, పెండింగ్‌లో ఉన్న పనులను క్లియర్ చేయాలని డీసీని కార్పొరేటర్ కోరారు.

కాంగ్రెస్ ఏఎస్‌రావునగర్ డివిజన్ అధ్యక్షుడిగా అంజిరెడ్డి



కాప్రా: కాంగ్రెస్ ఏఎస్‌రావునగర్ డివిజన్ అధ్యక్షుడిగా కొత్త అంజిరెడ్డి నియమితులయ్యారు. వరుసగా రెండోసారి డివిజన్ అధ్యక్షుడిగా ఎన్నికైన అంజిరెడ్డి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌గౌడ్ నుంచి నియామక పత్రాన్ని అందుకున్నారు. ఎన్‌ఎస్‌యూఐ నాయకుడిగా విద్యార్థి దశ నుంచే విద్యారంగ సమస్యలపై పోరాడిన కొత్త అంజిరెడ్డి అనంతరం ఎన్‌ఎఫ్‌సీలో ఉద్యోగం సంపాదించారు. రెండు దశాబ్దాల పాటు అణు ఇంధన సంస్థ ఉద్యోగిగా సేవలందిస్తూ యూనియన్ కోశాధికారిగా కొనసాగారు. జాతీయ స్థాయిలో డిపార్ట్‌మెంట్ కౌన్సిల్ సైడ్ సభ్యుడిగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం ఉద్యోగ విరమణ తర్వాత తిరిగి కాంగ్రెస్ పార్టీకి నిబద్ధతతో సేవలందిస్తూ క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. రాజకీయాల్లోనే కాకుండా తాను నివాసం ఉంటున్న భవానీనగర్ కాలనీ అధ్యక్షుడిగా రెండు పర్యాయాలు ఎన్నికై కాలనీ అభివృద్ధికి తోడ్పడ్డారు. రెండో సారి తనపై నమ్మకంతో డివిజన్ పార్టీ అధ్యక్షుడిగా నియమించిన టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్, ఉప్పల్ నియోజకవర్గం బీ బ్లాక్ అధ్యక్షుడు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి తదితరులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ముందుకెళ్తానని పేర్కొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు వైద్యం అందించాలని వినతి

బోడుప్పల్: బోడుప్పల్‌లోని యుక్త హాస్పిటల్స్‌లో సీపీఆర్‌ఎంఎస్ (కాంట్రిబ్యూటరీ పోస్ట్ రిటైర్ మెడికేర్ స్కీం) మెడికల్ కార్డు ద్వారా సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు వైద్యం సౌకర్యం కల్పించాలని హాస్పిటల్ సీఈఓ శ్రీవల్లికి సంఘం ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి రిటైర్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఆళ వందార్ వేణుమాధవ్ మాట్లాడుతూ బోడుప్పల్, మేడిపల్లి, పీర్జాదిగూడ, చెంగిచర్ల పరిసర ప్రాంతాల్లో పదవీ విరమణ పొందిన సింగరేణి ఉద్యోగులు 500 మందికిపైగా ఉన్నారన్నారు. సింగరేణి యాజమాన్యం అందించిన సీపీఆర్‌ఎంఎస్ మెడికల్ కార్డులు ఉపయోగించుకోవాలంటే దగ్గరలో ఎంప్యానల్ హాస్పిటల్స్ లేవన్నారు. యుక్త హాస్పిటల్ ద్వారా వైద్య సేవలు అందించాలని హాస్పిటల్ యాజమాన్యాన్ని కోరినట్లు వెల్లడించారు. సీపీఐ మండల కార్యదర్శి రచ్చ కిషన్, అసోసియేషన్ నాయకులు బీరయ్య, కనకయ్య, రామరాజు, సూర్యనారాయణ, చక్రపాణి, లక్ష్మయ్య, ప్రభాకర్, నరేందర్‌రెడ్డి, నర్సింగ్‌రావు ఉన్నారు.



హాస్పిటల్ సీఈఓ శ్రీవల్లికి వినతి పత్రం అందజేస్తూ..